క్లుప్తంగా

కనులపండువగా పార్వతి పరిణయ ఉత్సవం



నెల్లూరు(బృందావనం): వైశాఖ మాసం సందర్భంగా నగరంలోని మూలాపేటలో ఉన్న భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో వసంతోత్సవాలు సంప్రదాయంగా, వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి పార్వతి పరిణయ అలంకార ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తగా పెటేటి సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. కార్యక్రమాలను ఈఓ ఎ.వేణుగోపాల్ పర్యవేక్షించారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో సీతారాములను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అనంతరం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నెల్లూరు సిటీ: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన ఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు గ్రామంలోని బలరామపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆదిపూడి లక్ష్మమ్మకు (43) వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో వివాహమైంది. వారికి శ్రీనివాసులు అనే కుమారుడు ఉన్నాడు. కాగా వెంకటేశ్వర్లు కొన్నేళ్ల క్రితం భార్యను వదిలేసి వెళ్లిపోయాడు. మూడునెలల క్రితం ఇంటికి తిరిగొచ్చాడు. బుధవారం రాత్రి అందరూ భోజనం చేసి నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున ఇంటి వెనుక ఖాళీ స్థలంలో లక్ష్మమ్మ చనిపోయి ఉండడాన్ని నారాయణ అనే వ్యక్తి చూసి శ్రీనివాసులుకు చెప్పాడు. అదే సమయంలో వెంకటేశ్వర్లు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేష్(35) మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఉడ్‌హౌస్‌పేట వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొన్నాడు. దీంతో అతను రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి హైవే అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో బుచ్చిరెడ్డిపాళెం వద్ద మృతి చెందాడు. దీంతో వెంకటేష్ మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం మార్చురీకి తరలించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

ఆటోను ఢీకొన్న కారు

- మహిళకు తీవ్రగాయాలు

సంగం: ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన గురువారం రాత్రి దువ్వూరు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన విజయలక్ష్మికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం ఉదయం నెల్లూరు వైద్యశాలకు వెళ్లింది. అక్కడ చూపించుకుని తిరిగి ఆటోలో సంగం వస్తుండగా దువ్వూరు వద్ద సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటి ముంజలకు ఫుల్ డిమాండ్

- పోషకాలు అధికం
- నగరంలో విస్తృతంగా విక్రయాలు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద తాటి ముంజల విక్రయం

నెల్లూరు(బారకాసు): వేసవిలో ఎక్కువగా దర్శనమిచ్చే చల్లని ఫలం తాటి ముంజలు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ, కూల్ డ్రింక్స్, కొబ్బరి బోండాలున్నా ముంజలను తినేందుకు అనేకమంది ఆసక్తి చూపుతుంటారు. సూర్యప్రతాపాన్ని తట్టుకునేందుకు కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా ఉండడంతో వాటికి గిరాకి ఏర్పడింది.

ప్రజల ఆసక్తి

తాటి ముంజలు వేసవి సీజన్లో మాత్రమే దిరికే పల్లెటూరి మధురాలు. వీటిపై ప్రజలు ఆసక్తి చూపడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. తాటి చెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి అప్పటికప్పుడు కాయలు కొట్టి ముంజలను తీసి విక్రయిస్తున్నారు. గతంలో చాలా తక్కువ ధరకు లభించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడ చూసినా పొలాల గట్లపై తాటి చెట్లు ఉండేవి. ఇప్పుడు ఎక్కడో కొన్ని ప్రాంతాల్లోనే దర్శనమిస్తున్నాయి. దీంతో డిమాండ్ పెరిగిపోయింది.

జోరుగా..

నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, సంతపేట, చిన్నబజార్, మినీబైపాస్‌రోడ్డు, ముత్తుకూరురోడ్డు సెంటర్ తదితర ప్రాంతాల్లో తాటి ముంజలను విక్రయిస్తున్నారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాలైన రాజుపాళెం, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, బుచ్చి, ఇందుకూరుపేట తదితర ప్రాంతాల నుంచి గ్రామీణులు తాటిముంజలను నగరంలోకి తీసుకొచ్చి విక్రయిస్తూ అనేక పేద కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పోషక విలువల్లో మేటి

వంద గ్రాములు తాటి ముంజలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాములు కార్బోహైడ్రేట్లు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచుపదార్థాలు, 0.1 గ్రాముల కొవ్వు, 0.061 గ్రాముల ఆమ్లం, 12 మి.లీల కాల్షియం, 21 మి.లీల పాస్పరస్, 0.2 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటాయి. సీజన్లలో దొరికే తాటి ముంజలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు.

వాణిజ్య కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

- ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ



కేటరింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ఉన్న వ్యాపార వాణిజ్య కేంద్రాల్లో కార్పొరేషన్ సూచించిన నిబంధనలను నిర్వాహకులు ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నామని ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఎన్టీఓ కాలనీ 21/3 సచివాలయ పరిధిలోని శ్రీసాయి నిషిత కేటరింగ్ సెంటర్‌ను ఎంహెచ్‌ఓ గురువారం తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్, ఎన్‌ఓసీ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాలలో తగినంత గాలి, వెలుతురు ప్రసరించేలా, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వంట చేసే సిబ్బంది తప్పనిసరిగా ఆరోగ్యవంతులై ఉండాలని, జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి ధ్రువీకరణపత్రాలను తప్పనిసరిగా పొంది ఉండాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ సూచించిన అన్ని నిబంధనలను వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా..

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో భాగంగా అన్ని డివిజన్లలో కాలువల్లో పూడికతీతకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. 11వ డివిజన్ రాయపుపాళెం ప్రాంతంలో పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. అన్ని డివిజన్లలో నిరంతరం పర్యవేక్షించేలా సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయరాదన్నారు. నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు.

సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన

- నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్): 'సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవగాహనతోనే వాటి నియంత్రణ సాధ్యం' అని నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో సైబర్ నేరాలపై మాట్లాడారు. అధికశాతం యువత ఇంటర్నెట్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. డేటింగ్ వెబ్‌సైట్లలో సబ్ స్క్రైబ్ చేసుకోరాదని, అందులో నుంచి వచ్చిన లింక్‌లను క్లిక్ చేయకుండా ఉండడం మంచిదన్నారు. పరిచయంలేని వ్యక్తులకు మీ వాట్సప్ నంబర్లు, మెయిల్ ఐడీలు షేర్ చేయరాదని, వీడియో కాల్స్‌లో మాట్లాడరాదని సూచించారు. ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను యాక్సెప్ట్ చేయకూడదన్నారు. నిజజీవితంలో పరిచయం ఉన్న వ్యక్తులను మాత్రమే ఆన్‌లైన్‌లో విశ్వసించాలన్నారు. అపరిచితులతో స్నేహాలు, ప్రేమలు మంచిది కాదన్నారు. ఆన్‌లైన్ వేధింపులు, ట్రోలింగ్‌లు పెరిగాయన్నారు. ఇంటర్నెట్ మాయలో పడి మానవ సంబంధాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలన్నారు. కేవైసీ అప్‌డేట్, లాటరీలు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగాలు, న్యూడ్ వీడియోకాల్స్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత వివరాలను, ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవడం మంచిది కాదన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడినా, ఇబ్బందులకు గురిచేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినప్పుడు ఎలాంటి సంకోచం, సందేహం పెట్టుకోకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930, సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

టీచర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



చికిత్స పొందుతున్న టీచర్ సుమన్‌రావు

నెల్లూరు(అర్బన్): ఎన్నికల విధుల్లో ఉండి అనారోగ్యానికి గురై ప్రస్తుతం అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు సుమన్‌రావు కుటుంబాన్ని ఆదుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ కోరారు. గురువారం వారు హాస్పిటల్‌కు వెళ్లి టీచర్ ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిక మండలం చిన్నయ్య గుంట పాఠశాలలో పనిచేస్తున్న సుమన్‌రావుకు ఆరోగ్యం బాగోలేదన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులను కోరాడని అయితే ఒప్పుకోలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో విధులకు హాజరైన సుమన్‌రావు స్పృహ తప్పి పడిపోయాడన్నారు. దీంతో దగ్గరలో ఉన్న వైద్యశాలకు ఆయన్ను చేర్చారన్నారు. అనారోగ్య తీవ్రతను బట్టి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలోకి తరలించారన్నారు. తిరుపతి కలెక్టర్, ఎన్నికల అధికారి స్పందించి ఆ ఉపాధ్యాయుడి వైద్యఖర్చులకు సాయం చేయాలని కోరారు.

సెల్ టవర్ పెట్టొద్దంటూ నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వెంగళరావునగర్ వాసులు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 33వ డివిజన్ వెంగళరావ్‌నగర్ సీబ్లాక్‌లో గురువారం స్థానికులు సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి మేఘనాథ్ సింగ్ మాట్లాడుతూ ఎటువంటి అవగాహన కార్యక్రమం చేపట్టకుండా సెల్ టవర్ నిర్మాణం చేయడం సరైంది కాదన్నారు. ఇళ్ల మధ్య ఏర్పాటు చేస్తే తమ ఆరోగ్యాల పరిస్థితి ఏమిటని అనేకమంది భయపడుతున్నట్లు చెప్పారు. పనులు నిలిపివేయాలని 15 రోజులుగా భవన యజమానిని కోరినా ఫలితం లేకపోవడంతో తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో గాలి మోషా, గంపిట్ల మోషా, రాజా, కొలగాని భాస్కర్, దయాకర్, శివ, దాస్, అనిల్, అభి, కుట్టి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతి

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపించాలంటూ అక్కడి జనం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

23న శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేట శంకరమఠంలో ఈనెల 23వ తేదీ ఉదయం 8 గంటలకు చండీహోమం జరుగుతుందని ఆ మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునే వారు తమ గోత్ర నామములు నమోదు చేసుకునేందుకు 96528 60264, 99499 18358 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

రూరల్లో చిరుజల్లులు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి వాతావరణం మారింది. బుజబుజనెల్లూరు, కొత్తూరు, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురవడంతో తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభించింది.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

ముత్తుకూరు: పట్టణంలోని బలిజపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. భానుమునిసంజీవ్, వై.తేజాస్వరూప్, బి.నిఖిల్, బి.హద్వినికేత్, బి.జ్యోతిష, ఎస్‌కే అప్సర, పి.జాహ్నవి చిలమానుచేను, గండిపాళెం, వెంకటగిరి రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం గురువారం తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు స్వల్పగాయాలు



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు, లారీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రాఘవరెడ్డికాలనీ వద్ద గురువారం వింజమూరు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును.. నెల్లూరు నుంచి సంగం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్యం చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.

11 సచివాలయాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా బీసీజీ టీకా కార్యక్రమాన్ని రూరల్ మండలంలోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 11 వార్డు సచివాలయాల్లో గురువారం ప్రారంభించారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పెంచలయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి పెద్ద చెరుకూరు సచివాలయంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవీ మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు, ధూమపానం అలవాటు ఉన్న వారితోపాటు గతంలో క్షయ వాధికి గురైన వారు, వారి కుటుంబసభ్యులను గుర్తించి తప్పనిసరిగా టీకా వేయాలన్నారు. అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ టీకా వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కొడావత్ బలరామ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విడవలూరు సుజాత, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రగిరి లూసీ, క్షయ నివారణ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ వైష్ణవిని సన్మానించిన నాయకులు

నెల్లూరు(అర్బన్): ప్రజలు రక్తపోటు (బీపీ) పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదడు, నరాల వ్యాధి నిపుణురాలు డాక్టర్ వైష్ణవి సూచించారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డేను పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ పెంచలయ్య ఆర్థోపెడిక్ ఆస్పత్రి ఆవరణలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ థీమ్ ప్రకారం బీపీని చెక్ చేయించుకోవాలన్నారు. హైబీపీ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలన్నారు. రక్తపోటు ఎక్కువైతే గుండె పోటు, పక్షవాతం, కంటి వ్యాధులు వస్తాయి కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌పీ అసోసియేషన్ నాయకులు డాక్టర్ వైష్ణవిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, సీనియర్ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, వీరయ్య, ప్రసాద్, మాలిని, కరుణకుమారి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడలో వైద్యసిబ్బంది ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: డెంగీ నివారణపై మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గురువారం ఆ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్‌బాబు మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో డెంగీ, మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. ఎవరికైనా జ్వరం, ఒళ్లనొప్పులు, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయ్‌కుమార్, నాగరాజు, హెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం



పరిశీలిస్తున్న పోలీసులు

సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఆలయాల ప్రాంగణంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తలుపుల తాళాలు పగులగొట్టేందుకు యత్నించి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఆలయాల వద్దకు వచ్చిన అర్చకుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆలయం వద్దకు వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తెలుగుగంగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సంజయ్‌గాంధీ నగర్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నెల్లూరు టౌన్ విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, జెడ్పీ కాలనీ, ఇందిరా గాంధీనగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ పూజలు చేస్తున్న వేదపండితులు



స్వామి, అమ్మవార్లకు పూజలు



సాంస్కృతిక ప్రదర్శన

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా పుట్టమన్ను తీసుకొచ్చి విశేష పూజలు నిర్వహించడం జరిగింది. ఉభయకర్తలుగా దువ్వూరు నరసింహులు బ్రదర్స్ వ్యవహరించారు. మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్‌కు చెందిన బృందం నిర్వహించిన కూచిపూడి భరతనాట్యం, పాశం మస్తానయ్య వారిచే నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. కార్యనిర్వహణాధికారి గిరికష్ణ, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.